ఆర్తనాదము

వేదుల సత్యనారాయణశాస్త్రి

ఆనాడు కార్తికశుద్ధ చతుర్దశి. రాత్రి తొమ్మిదిగంటలవుతుంది. ఢక్కామస్లిన్ పరచినట్లు తెరలుతెరలుగా వ్యాపించిన పండు వెన్నెల సృష్టి కొకవిధమైన మైకము కలిగిస్తున్నది.

ఉమాపతి భోజనముచేసి పడకగదిలోకి వచ్చి కిటికీదగ్గర నిలుచొని, సుదూరపరిసమాప్తమైన అనవచ్ఛిన్న మబ్బుల గుట్టల లాగు కనబడుతున్న నల్లనికొండల పొడవులు చూస్తూ ఉన్నాడు. గౌతమీ శబరీ నదుల కలధ్వని చల్లగాలి తరంగాలమీద తేలి సుదూర సంగీతములాగు వినవస్తున్నదతనికి.

కిటికీకి దగ్గరగా ఉన్న పడకకుర్చీలో కూర్చొని టేబిలుమీది "ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ" తీసి చూస్తున్నాడతడు.

ఏనేవి ఉంటే ప్రపంచములో అదృష్టవంతుడంటారో ఉమాపతికి అవన్నీ ఉన్నవి. అయిదారు వేలువచ్చే పిత్రార్జితమైన భూవసతీ, కొన్నివేల వడ్డీవ్యాపారమూ, ఇవన్నీ చూచిపెట్టడమునకు తండ్రినాటినుండి నమ్మకముగా ఉన్న గుమాస్తా ఉండడమువల్ల సొమ్ము సంపాదిస్తేగాని కాలము వెళ్ళదనే విచారముగాని, ఇంటి వ్యవహారాలు చూసుకోవలసిన అవసరముగాని అతనికి లేదు. బి. ఎల్. ప్యాసయిన తర్వాత ఏ మూడు నాలుగుసారులో, అదైనా అన్యాయము జరుగుతున్నదని ఏపేదవాడో వచ్చి కాళ్ళావేళ్ళాపడి బతిమాలుకోవడమువల్ల కోర్టులో అడుగుపెట్టి ఉంటాడతడు.

ఉమాపతి పేరైన నాయుడుకుటుంబములోనివాడు. అతని తాతగారు సైన్యములో చేరి సుబేదారుపని చేశాడు. బర్మాయుద్ధములో చూపిన ధైర్యసాహసాలకు మెచ్చి ప్రభుత్వమువా రాయనకు శబరిఒడ్డున బంగారముపండే స్వర్గఖండాలవంటి లంకభూములినాముగా ఇచ్చారు. ఇప్పటికీ ఆయన పట్టిన అడ్డకత్తి డాలూ వారింట్లో ఉన్నవి. ఉమాపతితండ్రికూడా మంచి దేహపుష్టి కలవాడు. తాను కాకపోయినా తన కొడుకైనా సైన్యములో చేరి వంశానుగతములైన ధైర్యసాహసాలను నిలబెట్టేవాడు కావలెనని ఆయన కోరిక. కాని కొడుకుచిన్నతనములోనే ఆయన గతించాడు. ఏకపుత్ర విషయము కాబట్టి ఆయనభార్య ఆయనకోరిక తీర్చడానికి సాహసించలేకపోయింది. నాలుగు రోజులపాటు కొడుకు తన కంటబడకపోతే ఆ తల్లి ఇప్పటికీ తహతహలాడిపోతుంది.

ఉమాపతికి సర్వవిధాల అనుకూలురాలైన భార్య లభించింది. ఆమె పేరు లక్ష్మి

దేవి. నిజముగా ఆమె లక్ష్మి. ఒక్కమాట చెపితే చాలు. అత్తగారూ, ఇరుగుపొరుగు సంసారస్త్రీలూ ఆమెను "మాపాలి అన్నపూర్ణ"అని ఉగ్గడిస్తుంటారు.ఉమాపతికి కూడా భార్యఅంటే అమితమైన అనురాగమూ, గౌరవమూ. ఎంతో అన్యోన్యముగా ఉంటున్న ఆ దంపతులకు ఒక్కవిషయములోమాత్రము తరుచు జగడము వస్తుంటుంది. ఒక్కొక్కనాడు రోదనముతో ప్రారంభమై సాంత్వనముతో చల్లారిపోతుంటుం దా జగడము. అదీ వేటవిషయములోనే—

వేట అంటే ఉమాపతికున్న సరదా అంతా ఇంతా కాదు. అందులో గోదావరిపై పడవమీద బయలుదేరి పక్షులను వేటాడడమంటే అతనికి ఒళ్లు తెలియదు. అతని భార్యకుగాని, అతని తల్లికిగాని ఈ వేటంటే సరిపడదు. అయినా కొడుకు మనస్సుకు కష్టము కలుగుతుం దేమో అని తల్లి మాత్రము ఈ వేట విషయములో అతనిని వారించలేదు. ఈ విషయములో కొడుకుతో జగడమాడినా కోడలిని ఏమీ అనేది కాదు. లక్ష్మి మాత్రము అవకాశము వచ్చినపుడల్లా వేట మానమని భర్తతో జగడమాడేది.

ఉమాపతి కాపురమున్న రామచంద్రపురము చిన్నదైనా నివాసయోగ్యమైన ఊరు. శబరినది గోదావరిలో కలిసే చోటికి మైలుదూరములో ఆ ఊరున్నది. ఊరికి పశ్చిమాన శబరి. దక్షిణాన మహాగౌతమి. ఊరికి అరమైలు దూరమునుంచి మహారణ్యము. ఆ అడవిలో 'మెరుగుమట్టి'గను లున్నవి. ఏదో విదేశీకంపెనీ ఒకప్పుడా వ్యాపారము సాగించి రేవుస్థలమైన జీడికుప్పవరకూ రాకపోకలకు వీలైనరోడ్డూ, అక్కడక్కడ గుట్టలమీద మంచి బంగాళాలూ నిర్మించింది. ఇప్పుడా వ్యాపారము లేదుగాని అందుకోసం చేసిన ఏర్పాట్లన్నీ ఉన్నవి. ఆ మహారణ్యము పాపికొండలు దాటితేగాని ఆఖరు కాదు.

పడవమీద ఉమాపతి పక్షులను వేటాడడమునకు పాపికొండలవరకు వెళ్లుతుంటాడు. ఎప్పుడూ కొత్త కొత్త పుస్తకాలు తెప్పించి చదువుతూ ఉండడమో, లేకపోతే నదిమీద షికారు బయలుదేరడమో ఇవే జీవితములో అతని కానందమిచ్చే పనులు. తరుచుగా అతడు కొన్ని పుస్తకాలు తీసుకొని వంటవాణ్ణి వెంటబెట్టుకొని పడవమీద బయలుదేరి మూడు నాలుగురోజులకుగాని ఇంటికి తిరిగిరాడు. అడవిమృగాలను వేటాడడముకన్నా నదిగట్టున ఆకాశాన్ని వెక్కిరిస్తున్నట్లున్న చెట్లమీది పక్షులను వేటాడడ మతనికి సరదా.

వానాకాలములో తప్ప ఏడాదంతా శబరినదిలో ప్రవాహ ముండదు. అందుచేత చాలావరకు అతని ప్రయాణము గోదావరిమీదనే. కొండలను చీల్చుకొని ప్రవహించే గోదావరిమీద ప్రయాణము చేస్తున్నప్పుడు మానవ ప్రపంచముతో సంబంధములేని ఇరుగట్లా పెరిగిఉన్న మహారణ్యమూ, ఆ అరణ్యములో కొండలలోనుంచి వరుణ కన్యల

లాగు పాడుతూ ఆడుతూ వచ్చి గౌతమీ ప్రవాహములో లీనమైపోయే సెలయేళ్లూ, ఆ యేళ్ళ ప్రక్కల గోదుమ తాచుకుబుసాలు పరచినట్లు ఏజాడా అంటని ఇసుకతిన్నెలూ, ఆ దిబ్బల పక్కనే మనుష్యహస్తమంటకుండా పెరిగిన అరటి, కమలా, మామిడి మొదలైన పండ్లచెట్లూ, ఆ చెట్లమీదుగా మెల్ల మెల్లగా గాలిలో తేలి కొండ శిఖరాలకు ఎగబాకిపోయే తెల్ల పొగమబ్బులూ, నెమళ్ల కేకలూ, ఈలకోళ్లకూతలూ, నీటిపిట్టల కలకలారావాలూ, వెదురుపొదల సంగీతాలూ, కొండలనీడలూ, చెట్లనీడలూ పడి నీలిమ తేరుతూ మచ్చలేని కొండచిలువలాగు మెల్లగా సాగుతున్న నదీప్రవాహమూ, ఆ ప్రవాహములో ఈదులాడుతూనో, గాలము వేసి చేపలుపడుతూనో వచ్చిపోయే పడవలకేసి వేడిచూపులతో బెచ్చిబెచ్చి చూస్తూ ఉండే సిగ్గెరగని కోయపడుచులూ, నీరు తాగుతున్న వనగజాలలాగు నీటి అంచుల కానుకోని నలుపుదేరి ఉన్న బండరాళ్లకు కొట్టుకోని భగ్నమైపోయే కెరటాలూ అతని మనోదేహాలను పులకరింపజేస్తవి. సృష్టిలోని వైచిత్ర్యమూ, అకృత్రిమ సౌందర్యమూ చూస్తూ ఆనదీవక్షాన ప్రయాణముచేస్తున్న పుడతనికి జరిగిపోయిన గాథలెన్నో జ్ఞాపకమువచ్చి ఒకవిధమైన పారవశ్యాన్ని కలిగిస్తవి. అందుకే భార్య కిష్టము లేకపోయినా అత డీనదిమీది షికారు మానలేకుండా ఉన్నాడు.

ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వేటను గురించి వ్రాసిన వ్యాసము చదువుతున్నాడుమాపతి ఆకులూ, వక్కలూ చేతబట్టుకోని అతని భార్య వచ్చి పక్కన నిలబడి "ఏమిటి చదువుతున్నా"రని అడిగింది.

అతడు నవ్వుతూ "ఇదిగో చూడు" అని ఆ పత్రిక ఆమె కళ్లముందు పట్టి చూపించాడు.

"మృగాలూ, పక్షులూ కనబడుతున్నవి. ఇదేదైనా వేటను గురించి వ్రాసిందా" అని అంటూ వక్కలు నోటి కందించిం దామె.

వక్కలు కొరుకుతూ అతడు "అవును. ఒక దొర దక్షిణాఫ్రికాలోని తన వేట అనుభవాలను వ్రాశాడు. వ్యాసము చాలా ఉత్సాహకరముగా ఉంటే చదువుతున్నాను" అన్నాడు.

ఈ మాటతో కలకల్లాడుతూ ఉన్న ఆమెముఖము ఒక విధమైన అప్రసన్నతతో చిన్నపోయింది. ఇటువంటిపుస్తకాలు చదివితే తన భర్తకు వేటమీద మనసుపుడుతుందని ఆమెభయము.

లక్ష్మీదేవిహృదయము అతికోమలము. కవిత్వానికి ఛందస్సెటువంటిదో ఆమెహృదయానికి కోమలత్వ మటువంటిది. కావ్యప్రపంచములోని మాధుర్యమంజులతలు పడుగుపేకలుగా నేసిన నేత ఆమె మనస్సు. ఆ నేతలోని సౌకుమార్యమూ, పవిత్రతనమూ ఆమె ప్రతిమాటలో స్ఫురిస్తూ ఉంటుంది. ఆకంత

స్వరము చెవిబడ్డప్పుడు ఎట్టి శ్రోతమనసులోనైనా సరే ఒకవిధమైన ఆనందమూ, తృప్తీ వికసిస్తవి. ఇక భర్తమాట చెప్పేదేమిటి? నిజముగా ఆమె అశోకుని కాలములో ఉండవలసినదే గాని హింసాచ్ఛాయలలో బ్రతుకుతున్న ఈనాటి ప్రపంచములో ఉండవలసినది కాదు. ఏ ప్రాణి కష్టపడడము చూచినా ఆమె మనస్సు బాధపడుతుంది. మాంసపుకూర ముట్టుకోవడానికి కూడా సాహసించని ఆమె మనస్సు ఉమాపతికి తెలియనిదికాదు. అందుచేతనే అతడామెమనస్సుకు నొప్పి కలిగే మాటగాని, పనిగాని తలపెట్టడు. తన భార్య ఇటువంటి దనుకోవడమే అతనికి ఎంతో గర్వము. అతనిప్రాణాని కామె వేయిరేకుల తామరపై కొలువున్న విశ్వమాత. ఆమె ముఖము అప్రసన్నమైతే అతని గర్వ శిఖరానికి పెద్ద దెబ్బ తగుల్తుంది. అందువల్ల అతడు అనుక్షణమూ ఆమెహృదయానికాహ్లాదము కలిగించడానికే యత్నిస్తాడు.

వేటమాట చెవి బడగానే ఆమెముఖాన పొడగట్టిన భయము కనిపెట్టి అతడామెమనస్సుకు ఉల్లాసము కల్పించవలెనని ఆమె చేతిలోని ఆకులు తీసుకొని నమలుతూ, లేచి ఆమె భుజముపై చేయివేసి నెమ్మదిగా కిటికీదగ్గరికి చేర్చి "చూడు! ఎంత అందముగా ఉన్నదో" అని బయట చూపుతూ అన్నాడు.

నిజముగా బయట శరదుత్సవము సాగింది. విభావరీ లక్ష్మి తన జ్యోత్స్నా నృత్యముతో సృష్టిని పరవశము చేస్తున్నది. పచ్చని చెట్ల ఆకుజొంపాలమీద, మలిమంచున చెమ్మగిలిన పూలరేకులపైన, మింట తునక తునకలై గుంపు గుంపులై రకరకాల పొడవులతో, చందమామను పట్టుకొనడానికిలాగు విచ్చలవిడి పరువెత్తుతున్న మబ్బులమీద సౌందర్యదేవత ఊర్పుల కమ్మదనము చక్కగా అలలువారిపోతున్నది.

ఈ దృశ్యమువల్ల, భర్తృసుఖస్పర్శవల్ల ఆమె మనస్సు కలతదేరి వికాసము వహించింది. ఉమాపతి ఉద్వేగరహితముగా ఆమె ఎడమచేతిని తన రెండు చేతులతో పట్టుకొని "లక్ష్మి" అని రెప్పవేయకుండా ముఖము చూస్తూ అన్నాడు.

సమీపాన ఉన్న చెట్లలోనుంచి పక్షి ఏదో కూసినది. వెన్నెలవెల్లిలో ఈదుకొంటూ వచ్చి ఆ మధురకూజితము ఆశరద్రాత్రితోపాటు ఆ దంపతుల హృదయాలను పులకింపజేసింది.

లక్ష్మి నవ్వుతూ "విన్నారా?" అన్నది.

అతడు "అది రోజూ కూసేపక్షే. ఈవేళ దాని కూత ఇంత మధురముగా ఉండడానికి కారణము నీ మహిమో, వెన్నెలమహిమో మరి!" అన్నాడు. కొంచెము ముఖముచిట్లిస్తూ "మీ కొంటిమాటల కేమిగాని అంత శ్రావ్యముగా కూస్తూ ఆనందపెట్టే నిరపరాధిపక్షులను తుపాకితో కాల్చి చంపడానికి మీకు మనసెట్లా పుట్టుతుంది చెప్పండి" అన్నదామె. ఆ మాటకు జవాబేమీ చెప్పలేక అతడు

తన మనస్సులో "వేటలో ఉన్న మజా, ఆనందమూ వేటకాళ్లకు తప్ప ఇతరులకెల్లా తెలుస్తుంది? అందులో ఆడవాళ్లకు బొత్తిగా అర్థముకాదు" అని అనుకొన్నాడు.

ఉమాపతి ఏది మరిపించడానికి యత్నముచేశాడో దాని ప్రసంగమే వచ్చి పడింది వెంటనే అతడు మరి మాటాడలేక "అబ్బా! నిద్ర వస్తున్నది" అని ఆవలించాడు.

"మీ మనసులో దయాదాక్షిణ్యాలు లేవు కాబోలు! పక్షులు ఎంత చక్కనివి. ఎంత తియ్యగా కూస్తవవి. అటువంటిఅమాయికపు జీవాలను గుండ్లువేసి కాల్చి చంపే వాళ్లు—"

ఆమె మాట పూర్తికాకుండానే ఉమాపతి "అవి నీకంటె చక్కనివా? నీమాటలకంటె వాటిమాటలుతియ్యనివా?" అన్నాడు.

ఆమె నవ్వుతూ "అయితేచక్కదనాన్నీ, తియ్యదనాన్నీ కాల్చి చంపితే, ని—"

"ఛీ ఛీ-నీవు నా హృదయ పంజరశుకివి లక్ష్మీ!" అని రెండు చేతులతో పట్టుకొని ఆమె ముఖము తనముఖము దగ్గరికి తెచ్చుకొని ఆమె కళ్లలో కళ్లు గుచ్చి చూస్తూ "ఇటువంటి తలంపులు నీ మనస్సులోకి రానీయకు. వెళ్లి పడుకో. చాలా రాత్రి అయింది. నేను పెందలకడనే లేవవలసి ఉన్నది" అన్నాడు.

ఆమె ఒక నిట్టూర్పువిడిచి ఇంట్లోకి వెళ్లి పోయింది.

'పెందలకడనే లేవాలి'. అని ఉమాపతి అనడానికి కారణమున్నది. ప్రొద్దుటనే వేటకు వెళ్లడానికి బోటు సిద్ధము చేయుమని సాయంకాలమే సరంగుతో చెప్పాడతడు.

వేటసన్నాహాము పూర్తిఅయింది. బోటులోనే భోజనము చేయడానికి ఏర్పాటు అయింది. కావలసిన వంటసామగ్రితో వంటమనిషి రామచంద్రుడు ప్రొద్దున్నే బోటులోకి వెళ్లిపోయాడు. చలిదిఅన్నాలు తిని కళాసులూ, సరంగూ రేవులోకి వెళ్లినారు. ఉమాపతి స్నానముచేసి, వేటకు తగినవేషము వేసుకొని కాఫీత్రాగడానికి లోపలికి వెళ్లాడు. కాఫీత్రాగి మళ్లా తనపడకగదిలోనికి వచ్చాడు. అక్కడ అతనికి ముఖము చిన్నపుచ్చుకొని నిలుచున్నలక్ష్మి కనబడింది. మిలమిల మెరుస్తున్న ఆమెకాతరదృష్టులు అతనిని అడుగుసాగనీయలేదు. వెంటనే అతడు ఆమె దగ్గరికివెళ్లి "ఎందుకు అలా ఉన్నావు?" అన్నాడు. గుడ్లనీరు గుక్కుకుంటూ ఆమె అతనివైపుచూచి "బ్రతిమాలుకుంటాను. ఈ వేళ ఈపాడువేట మానివేయండి. నామనసు బాగాలేదు. రాత్రిపాడుకలలతో తెల్లవారింది" అని అతనిచేయిపట్టుకొని అన్నది.

అతడు చిన్నననవ్వునవ్వుతూ "ఆరోజు ఎవడోసన్యాసివచ్చి ఏవోపాడుమాటలుచెప్పిన దగ్గరనుంచి నీకు భయము ఎక్కువయింది. ముష్టికోసము నోటికి వచ్చినట్లల్లాపేలే సన్యాసులమాటలు విని మనసు పాడుచేసుకుంటే ఎలాచెప్పు?" అన్నాడు.

"సన్యాసిమాటలు కాదు" అని ఆమె అతనివక్షమున ముఖము ఉంచి వెక్కి వెక్కి ఏడుస్తూ "భయము కాదు. నిజముగానే ఈ రోజు మిమ్మలిని విడిచిపెడితే ఇక మళ్లా మిమ్మలిని చూడనేచూడనని నామనసు చెపుతున్నది. కలకూడా అలాగే వచ్చింది" అని అన్నది.

"అయితే చూడు. నీవుకూడా నావెంట రా. నేను అమ్మతో చెప్పివస్తాను."

"ఇప్పుడు నన్ను పడవమీద తీసుకొని వెళ్లడానికి మీ అమ్మ ఒప్పుకుంటుందా? అసలు పడవప్రయాణము పనికిరాదు" అని ఆమె నేలచూస్తూ అన్నది.

ఉమాపతి ఉలికిపడ్డట్టు అయి నవ్వుతూ ఆమెను తనహృదయముమీద చేర్చుకొని, మెల్లగా తన చేతితో నెలలు నిండినగర్భమును నిమురుతూ "నిజమే. నీవు పడవమీదరావడమునకు నేనుమాత్రము ఎట్లా సమ్మతిస్తాను? చూడు. దీపాలుపెట్టకముందే వచ్చివాలుతాను నీదగ్గర. నీకేమీ భయము లేదు. పిచ్చిపిచ్చి ఊహాలు ఊహించకు" అని కళ్లుతుడుస్తూ ఆమెరెండు చేతులు తనభుజాలపై వేసుకొని ఒక్కముద్దు పెట్టుకొన్నాడు. ఆమెకు మరి మాటాడడమునకు అవకాశము లేకపోయింది. ఉమాపతి బోటున్న రేవుకు బయలుదేరి వెళ్లాడు.

లక్ష్మీదేవి కడుపునొక్కినట్లయి ఒక్క పెద్దనిట్టూర్పు విడిచింది.

గోదావరీమహాప్రవాహముమీద పడవ తేలిపోతున్నది. తెరచాప ఎత్తారు గాని వాలుగా ఉండడమువల్ల తెడ్లు వేయవలసిన అవసరములేక కళాసులు ఒకచోట కూర్చొని సంసారకష్టసుఖాలు చెప్పుకొంటున్నారు.

శ్రావణభాద్రపదాలలో, రక్తచందనము పూసుకొన్న వీరాంగనవలె మానవులకు భయంకరమూర్తియై కనిపించే గోదావరి నడుకార్తికమున నర్తకివలె ఆడుతూపాడుతూ సాగుతున్నది. ప్రవాహమున సుళ్లులేవు, పెద్ద పెద్దకెరటాలులేవు. చుట్ట చుట్టుకొన్న కోడె తాచులవంటి నురుగుపొంగులులేవు. కేవలము శాంతమూర్తివలె చిరుతరంగాల జలజలారావముతో మనస్సును పులకరింపజేస్తున్నది.

బాలాతపము నదీవక్షాన సౌందర్య జాలము పన్నుతున్నది. ఒడ్డున ప్రాకుల క్రింది బండరాళ్లమీద మహామునులలాగు కొంగలు దొంగజపము చేస్తున్నవి. కొన్ని చిన్నచిన్ని నీటిపిట్టలు కిలాకిలా రావాలతో ఎగిరిపోతున్నవి.

గట్లమీద పొట్టవెళ్లనిజొన్నచేలు గాలి తరగలకు వాలితేలుతూ సస్యలక్ష్మికి వింజామర వీస్తున్నట్లున్నవి. ఉమాపతి పడవలో కూర్చొని గట్టువంక చూస్తున్నాడు. లక్ష్మీదేవి విడిచిన నిట్టూర్పుగాలి ఇప్పటికీ అతనిహృదయాన్ని చలింపజేస్తున్నది కాబోలు!!

కాంతిపూర్ణమైన నీలాకాశము నదీప్రవాహములో ఖండఖండములై ప్రతిబింబిస్తున్నది.

గట్టున ఉన్న పెద్దమ్రాకులనీడలు తరంగాలతోపాటు నదీగర్భమున పాకులాడుతూ ముడుచుకొంటూ ఒకవింతదృశ్యాన్ని సృష్టిస్తున్నవి. నీటిప్రబ్బలిపొదలు ప్రవాహాన్ని అనుసరించి వంగిలేస్తూ నదీదేవతకు నమస్కరిస్తున్నట్లు కనబడుతు న్నవి. గాలిపోసుకొన్న వెదురుపొదలలోనుంచి వచ్చే కలనాదాలకు ఈలకోళ్లు శ్రుతివేస్తున్నవి. ఈదృశ్యాలుగాని, ఈసౌందర్యముగాని ఉమాపతికి హృదయాకర్షకములు కాలేదు. వేటకోసము నదిమీద బయలుదేరినప్పుడెల్ల సౌందర్యముగ్ధమై పారవశ్యమును అనుభవించే అతనిమనస్సులో ఈవేళ తెలియని అలజడి ఏదో కలుగుతున్నది.

ఎండలో చురుకు ఎక్కువవుతున్నది. ఉమాపతి 'రిస్టువాచి' చూచి పదిగంటలయిందనుకొని 'చంద్రూ' అని పిలిచాడు.

రామచంద్రయ్య 'బాబూ' అంటూవచ్చి నిలుచున్నాడు.

"వంట అయిందా?" అని అడుగుతూ కాలుస్తున్న సిగరెట్టు నీటిలో పారవేశాడు. అది 'చుయ్యి' మని ఆరి వెనకకు కొట్టుకోపోయింది.

"అయినట్టే. 'షోచారం' రావడముతోనే పడవ ఆపి భోజనము కానిచ్చుకోని మనము గట్టుచేరవచ్చు."

"సరే. మధ్యాహ్నము గాలి సరిగా ఉండకపోవచ్చు. ఎదురుకూడా. ఏలాగైనా ఇంటికి ఆరుదాటకుండా చేరాలి. ఆలస్యము కాగూడదు. మధ్యాహ్నానికి కావలసిన 'టిఫిన్' వగైరా ఇప్పుడే తయారుచేసుకో" అని ఉమాపతి పెట్టెతీసి తుపాకి చేతితో పుచ్చుకొన్నాడు. గుండెతోపాటు అతని చేయి వణికింది ఎందుచేతనో—అనాడు.

హింసాత్మకమైన వేటలోకూడా ఒకవిధమైన రసానుభూతి ఉన్నది. ఆ ఆనందరసానికి ఈ వేపథువు సాత్వికచేష్టకాబోలు!! కవులు వర్ణించకపోయినా, లక్షణవేత్తలు నిర్వచించకపోయినా, ఈఉల్లాసమును ఆనందమని చెప్పడమునకు భయమెందుకు మనకు?

ఉమాపతి తుపాకిసరి చేసి అదీఇదీ తు?చి ఒకసారి గుజ్జము నొక్కిచూసి, మరల పెట్టెలో పెట్టాడు. తూటాలసంచి బయటికి తీసిపెట్టాడు. ఇంతలోచంద్రువచ్చి "బాబూ! షోచారం వచ్చాము. పడవ రేవుకు పట్టవలసిందని చెప్పాను. భోజనము సిద్ధముచేశాను. దయచేయండి" అని చెప్పాడు.

"అచ్ఛా" అంటూ ఉమాపతి భోజనానికి వెళ్లాడు.

భోజనముకాగానే తుపాకీ, తూటాలసంచి, కొట్టినపక్షులను వేసేసంచి తీసి, తుపాకి తాను పట్టుకొని, తక్కినవి చంద్రుచేతి కిచ్చి ఉమాపతి పడవ దిగి గట్టువెంటనే బయలుదేరాడు.

ఇదివరకు ఎండవేళలో పక్షులు గుంపులు గుంపులుగా చెట్లమీద ఉండేవి. కొన్నిపిట్టలు

ఈగట్టుననుంచి ఆగట్టుకుపైన ఎగిరిపోతుండేవి. కాని ఆశ్చర్యము! ఆవేళ వేటకు తగిన పక్షి ఒక్కటైనా కాన్పించడములేదు. పక్షికులము ఏమయింది? ఇంద్రజాలమా, లేక ఏదైనా మంత్రప్రభావమా అనుకొన్నాడు ఉమాపతి. ఏసమయములోనైనా పని సరిగా అనుకొన్నట్లు జరగకపోతే కొంతమందికి విసుగుపుడుతుంది. కొంతమందికి విఘ్నము వచ్చినకొద్దీ ఉత్సాహ మెక్కువవుతుంది. వేటకూడా జూదమువంటిదేకదూ! ప్రయత్నము వ్యర్థమైనకొద్దీ ఉమాపతికి ఉత్సాహము, పట్టుదలా ఎక్కువవుతున్నవి. ఏలాగైనా ఏవోకొన్నిపక్షులను కొట్టకుండా తిరిగివెళ్లే ప్రకృతికాదు అతనిది.

మూడుగంటలయింది. పొద్దు వాలిపోతున్నది. ఎండవేడి కొంచెము కొంచెము తగ్గిపోతున్నది. ఆకాశాన ఒకమబ్బుతునకైనాలేదు. పోచారముదగ్గర నదీతీరభూమి అరణ్యమయము. నదీప్రవాహానికిఅంటే పెద్ద పర్వత మున్నది. ఆపర్వతము చరియల్లో కోయలు పోళ్లు చల్లారు. జొన్నపైరు బాగా పెరిగిఉన్నది. దూరాన విప్పపూవు లేరుతున్న కోయపడుచుల 'రేలపాటలు' సన్నసన్నగా వినబడుతున్నవి. రాళ్లను ఒరుసుకుంటూ నదీప్రవాహము చప్పుడుచేస్తూపోతున్నది. ఉమాపతి తుపాకి బుజము మీద పెట్టుకొని చెట్లమీదనూ, పొదలనూ పరికించిచూస్తూ ముందుకు వెళ్లుతున్నాడు. వేటకువచ్చి కొట్టడానికి ఏమీ దొరకనప్పుడు వేటకానిమనస్సు ఏలాగుంటుందో! వ్యర్థమవుతున్నదిగదా అని ప్రయత్నము మానివేయడము వేటకానిలక్షణము కాదు. అయినా 'రిస్టువాచి' చూచి 'నాలుగుకావచ్చింది. ఇక ఆలస్యముకాగూడదు' అనుకొని ఉమాపతి నలుదిక్కులా వెదకడ మారంభించాడు.

గట్టుకు కొంచెముదూరములో అంత ఎత్తుగాలేని చెట్టుకొమ్మమీద కలిసికూర్చున్న రెండుపక్షులు ఉమాపతికంట బడినవి.

అది జక్కవజంట. కావ్యప్రపంచములో దాంపత్యప్రణయమును వర్ణించేటప్పుడు ఏకవీ ఈజక్కవజంటలను స్మరించకుండా ఉండలేదు. సూర్యాస్తమయము కాబోతున్నది. రాబోయే వియోగమునుగూర్చి, ఆజంట మాట్లాడుకుంటూ, ఒకదానినొకటి ఓదార్చుతున్నదో, ఏమో! అప్పుడప్పుడు రెక్కలార్చుతూ ముక్కులు కలుపుకొని అవ్యక్తాలాపము చేస్తున్నది. మనుష్యుని అలికిడి వినేస్థితిలో లేదుకాబోలు ఆజంట.

చంద్రుడు ఇంకా వెనకనే ఉన్నాడు. ఉమాపతి మెల్లగా ఒకపొద చాటుచేసుకొని ఆ పిట్టలను గురిచూచాడు.

తుపాకిగుండు టక్కుమన్నది. పెద్ద మోత బయలుదేరి ఉరుమువలె రాళ్లకుప్పల మీదుగా కొండచరియను మారు ... గిస్తూ పరుగెత్తిపోయింది. గొట్టములోనుంచి సన్న పొగ వచ్చింది. పిట్టపడిన చిన్నచప్పుడు విన వచ్చింది. ఒకపిట్ట కాతరధ్వనితో పైకి ఎగి

రింది. ఆపక్షి ఆర్తధ్వనితో మళ్లా కొండ ప్రదేశము ఒకమారు కలగిపోయింది.

అటువంటి జాలిగొలిపేకూత ఉమాపతి ఇదివర కెన్నడూ వినలేదు. అతని హృత్పిండము కలుక్కుమన్నది. చీత్కారముచేస్తూ ఆకాశాన తిరుగుతున్న ఆపక్షికేసి అదేపనిగా చూడడము మొదలుపెట్టాడు.

ఇంతలో చంద్రుడు వచ్చి "పక్షి పడ్డది పక్షి పడ్డది" అంటూ ఆచెట్టుకిందికి పరుగెత్తి నెత్తురోడుతున్న పక్షిమెడ పట్టుకొని పైకెత్తాడు.

పూర్వ మొకప్పుడు తమసాతీరాన వియోగకాతరమైన పక్షియేడ్పు మహాముని వాల్మీకిచెవిని పడింది. రామాయణకావ్యముతోపాటు, ఆపక్షియేడ్పు నేటికీ మానవజాతి హృదయమును స్పృశిస్తూ నేడున్నది. మానవుల యేడ్పుకంటె పక్షియేడ్పు తక్కువదా?

తనప్రియురాలిని కోల్పోయిన చక్రవాకము కరుణమయమైన తనవిలాపముతో సమస్తాకాశతలమును నింపివేస్తున్నది. ఇటువంటి పక్షిశోకము ఉమాపతిచెవిని ఎన్నడూ పడలేదు. కాని వాల్మీకిహృదయమును ద్రవింపజేసిన క్రౌంచవిలాపముసంగతి హఠాత్తుగ అతనిమనసులో తోచింది. ఆసంగతి జ్ఞప్తికిరావడముతోనే అతనిమనస్సులో అతనికే తనచర్యమీద అసహ్యము వేసింది. దుస్సహమైన తనశోకముతో ఆచక్రవాకము మానవహృదయానికి ఎన్నడెరుగని యాతన కలిగించింది.

పక్షికళేబరమును చేతితో పట్టుకొన్న చంద్రుడునుచూచి "ఆపిట్టను అక్కడేఉంచు - ముట్టుకోవద్దు" అనిచెప్పి, తుపాకి వీపున తగిలించుకొని ఉమాపతి ఆపక్షివిలాపము వినలేక చెవులుమూసుకొని గబగబ పడవవైపు బయలుదేరాడు.

ఆకళేబరము చెట్టుకిందనే పడిఉన్నది. ఆమగపక్షివిలాపధ్వని, దానితోపాటు ఆచెట్టుచుట్టూ ఆకాశాన సుళ్లు తిరుగుతున్నది. హృద్భేదకమైన దానిఏడ్పు వాయుమండలమునుగూడా కరుణమయము చేసివేస్తున్నది.

ఉమాపతివాలకము చంద్రుడుకు అర్థము కాలేదు. సామాన్యమైనపక్షిచావు ఉమాపతి హృదయమును ఎందుకు కలతపెట్టుతున్నదో అర్థము చేసుకొనేశక్తి వాడికి లేదు.

మానవకాఠిన్యమువల్ల ప్రియురాలిని కోల్పోయిన ఆపేదపక్షిఏడ్పు వృద్ధగౌతమి ఓదార్పులతో కలిసి చెట్టుచెట్టుకు, పుట్టపుట్టకు గాలితరంగాలతోపాటు వ్యాపిస్తున్నది. ప్రతిదినమూ వియోగమును భరిస్తూ ఉన్న ఆపక్షికి ఎందరుసూర్యు లుదయించినా మరి సంయోగమన్నమాటలేని నేటివియోగము జీవశక్తిమూలమును పెల్లగించివేస్తున్నది కాబోలు!!

పడవ ఇంటిమొగము పట్టింది. ఇల్లు చేరడమునకు ఉమాపతి ఎంతో ఆరాటపడుతున్నాడు. అతనిహెచ్చరికవల్ల కళాసులు శ్రమలెక్కచేయకుండా తెడ్లువేస్తున్నారు.

పొద్దు కుంకింది. చతుర్దశి వెన్నెల గౌతమీవక్షాన మిలమిలలాడుతూ, దూరాన ఉన్న వస్తువు కనబడకుండా ఒకసన్నని తెల్లని తెరతో సమస్తమును కప్పివేస్తున్నది. గౌతమీ తరంగాలనాదములో అడవిలోనుంచి వీతెంచుతున్న అవ్యక్తనాదములో, ఒకకరణస్వరము తేలుతూవచ్చి ఉమాపతిచెవిలో ఏదో అశుభసూచకమైనవార్తను ఊదుతున్నది. ఆజక్కవయేడ్పు అతనికి మరుపురావడములేదు. ఆయేడుపే అతనిలో మాటిమాటికి వ్యాపించి తలలో గిఱ్ఱునతిరుగుతూ, హృదయానికివచ్చి తగులుతున్నది. ప్రొద్దున బయలుదేరేటప్పుడు తనకంటబడిన లక్ష్మీదేవి చిన్నపోయినముఖము మాటిమాటికి మనసున ఆడుతున్నది. కన్నీటితో మిలమిలలాడుతున్న ఆమెకళ్లు పొడగట్టినపుడు, మరణయాతన అనుభవించేటప్పటి హతచక్రవాకి కనులు జ్ఞాపకమువస్తున్నవి. "నా ప్రాణానికి ప్రాణమైనలక్ష్మి వేటకువెళ్లవద్దనిచెప్పినమాట వినిఉంటే హృదయానికింతఆవేదన లేకపోయి ఉండును. ఆమె నాకోసము ఎదురుచూస్తుంటుందికాబోలు!" అని మనసులో అనుకొన్నాడు ఉమాపతి. అందుచేతనే ఇంటికి చేరడానికి ఎన్నడూలేని ఆరాటము నేడతనికి కలుగుతున్నది. 'చంద్రూ ఎంతసేపటికి రేవుచేరగలము?' అని అడిగాడు ఉమాపతి. ఒక అరగంటలో చేరవచ్చు. దాదాపు వడ్డిగూడెముదగ్గరికి వచ్చాము" అన్నాడు చంద్రు. తెడ్లచప్పుడు వెన్నెలరాత్రిని కదిపివేస్తున్నది.

విరహాకాతరమైన ఆజక్కవచిన్నిగొంతులోనుండి వెలువడే హాహాకారము ఇంత దూరానికికూడా తరుముకొనివచ్చి ఆకాశముతోపాటు ఉమాపతి ధైర్యశక్తినిగూడా మింగివేస్తున్నది. అంత చిన్నపిట్టదేహములో ఇంతశక్తి, ఇంతప్రేమ ఎట్లా ఉన్నవో?

ఇంటికోసము ప్రాణమెంతో తల్లడిస్తున్నది. రాత్రి తొమ్మిది కావచ్చింది. నిన్న రాత్రి ఈ వేళకే పక్షికూత వినవచ్చి లక్ష్మి అన్నమాట లతనికి జ్ఞాపకమువచ్చినవి. పడవ శబరిమొగకు వచ్చింది. ఇంటికి దగ్గరవుతున్నకొద్ది ఉమాపతిఆరాటము హెచ్చిపోతున్నది. తల్లిమాట అతనికి స్ఫురణకు రావడమే లేదు. లక్ష్మి, తనలక్ష్మి, ఏమి చేస్తుంటుందో, తనమాట వినక బయలుదేరివచ్చానని ఎంత విచారపడుతున్నదో, ఆమె కిష్టము లేనిపని చేసి ప్రేమవిషయములో ఆమెకు సంశయము కల్గించడము మానివేయవలెను. ఈ వేటమీది మోజు తగ్గించుకోవలె. ఇక నాలక్ష్మిని విడిచి ఉండగూడదు. అని అతడు మనసులో నిశ్చయించుకొంటున్నాడు.

చంద్రు వచ్చి "పడవ రోడ్డురేవుకు వచ్చింది" అని చెప్పాడు.

వెంటనే ఉమాపతి ఒక్కదూకులో ఒడ్డుకుదూకి "సామానూ, తుపాకీ నీవు వెనకనుంచి తీసుకొనిరా" అని చంద్రుతో చెప్పి రోడ్డు ఎక్కి ఇంటివైపు గబగబ నడిచిపోసాగినాడు.

కనపడుతున్నది ఆవెన్నెలలో ఇల్లు. ఇంటిముందు అంతమందిజనము మూగి ఉన్నారెందుకు?

ఉమాపతిగుండె దడదడలాడింది. ఊపిరి బిగుసుకొనిపోతున్నది. వేళగానివేళ తన యింటికి ఈజనము రావడమునకు కారణమేమిటో ఎవరినీ అడగడానికి అతనికి నోరు రాలేదు. ఆజనము ఇతన్ని చూచి తప్పుకొన్నారు. అక్కడున్నవాళ్ల మొగాన వికాసమన్నమాటలేదు. లోపలికిరాగానే సావడిలో ముఖము వంచుకొని గుమాస్తా కనబడ్డాడు. అతనివాలకము చూచి ఉమాపతికి ఆరాటమెక్కువయింది. అడుగుల చప్పుడు విని గుమాస్తా ఉలికిపడ్డట్టు ఉమాపతిని చూచి "వచ్చారా? త్వరగా లోపలికిపొండి. మానవరమునుంచి డాక్టరుగారు వచ్చి లోపల ఉన్నారు" అన్నాడు.

డాక్టరు రావలసిన అవసరమేమి వచ్చింది? తనభార్యకు నీళ్లాడపొద్దు లన్నమాట అతని కప్పుడు వెంటనే జ్ఞాపకము వచ్చింది. గబగబ లోపలిగదిదగ్గరికి వెళ్లాడు. లోపటినుంచి సన్నని ఏడ్పు వినవస్తున్నది. ఆగది ముందే డాక్టరు నిలబడిఉన్నాడు ఉమాపతిని చూడడముతోనే అతనిముఖము వెలవెలపోయింది. నెమ్మదిగా "వచ్చారా? కాని—" అని మరి మాట పెగిలిరాలే దతనికి.

ఉమాపతి గట్టిగా అతనిచేయి పట్టుకొన్నాడు. ఆ గదిలోనుంచి, భద్రాచలము నుంచి రప్పించిన డాక్టరు, మంత్రసాని బయటికి వస్తున్నారు. ఉమాపతి ఆ గదిలోపలికేగి చూచాడు.

అతనిప్రాణశక్తి, జీవితలక్ష్మి, లక్ష్మి కిందపడుకోబెట్టి ఉన్నది. డాక్టరు నెమ్మదిగా దగ్గరికి వచ్చి ఉమాపతిచేయిపట్టుకొని 'ఒంటిగంటనుంచి ప్రయత్నించినా, లోపల పోయిన పిండాన్ని బయటికి తీయడానికి వీలుకాలేదు' అన్నాడు.

పక్క గదిలోనుంచి ఉమాపతికి తల్లి యేడ్పు వినవచ్చింది.

మంత్రసానివచ్చి "ఎంతకష్టపడితే ఏమి లాభము? ఎనిమిదింటికే నొప్పులు వచ్చినవి. శిశువు లోపలనే పోయింది. బయటికి తీయగలిగితే తల్లి బ్రతుకుందునేమో! కాని— పాపము! ఆ తల్లి అంతబాధలోనూ "వారు వచ్చారా? వారు వచ్చారా?" అని ఎన్నోసార్లు అడిగింది. మిమ్మలిని చివరసారి చూడడానికి నోచుకోలేదు." అన్నది.

సర్వము శూన్యము జగత్తంతా ఉమాపతికి అంధకారమైపోయింది. ఎంతోదూరాన్నుంచి ఏదో హాహారవము అతని హృదయములోనూ, ఆ గదిలోను నిండిపోయినట్లు అతన్ని క్షోభింపజేసింది.

పడి ఉన్న లక్ష్మికనులు, మృత్యుగ్రస్తచక్రవాకికనులు ఒకవిధముగానే తోచి అతని జీవశక్తిని కుదిల్చి వేసినవి. రెండుచేతులతో ముఖము మూసుకొని ఆచక్రవాకమువలెనే అతడు కూడా ఆర్తనాదము చేశాడు.